మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

బీసీ రుణాలకు బ్రేక్ ..?

-లబ్ధిదారుల చేతికందని స్వయం ఉపాధి రుణాలు - సబ్సిడీ నిర్ణయంపై ప్రభుత్వ మీనమేషాలు -ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

నిరుద్యోగులకు స్వయం ఉపాధిని కల్పించి ప్రోత్సహించే దిశగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ బిసి స్వయం ఉపాధి రుణాల పథకం ప్రస్తుతం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వ ఆదేశాలలో భాగంగా తాత్కాలికంగా రుణాల మంజూరుకు బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో సదరు రుణాల కోసం దరఖాస్తులు చేసుకొని ఎంపికైన లబ్ధిదారులు రుణాలు సబ్సిడీ కోసం ఆశగా ఎదురు చూడాల్సి వస్తున్న దుస్థితి జిల్లాలో బిసి కార్పొరేషన్ నుంచి ఎదురవుతుంది.

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

గడిచిన గత ఐదేళ్లలో గత ప్రభుత్వం బిసిలకు కార్పొరేషన్ ద్వారా రుణాలను మంజూరు చేసే ప్రక్రియను సంపూర్ణంగా నిలిపివేసింది. నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక బిసి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలకు నోటిఫికేషన్‌ను ఈ ఏడాది మార్చి నెలలో విడుదల చేసింది. జిల్లాలో ఉన్నత చదువులు చదివి ఉపాధి లేక ప్రభుత్వ సహాయ సహకారాల కోసం ఎదురు చేస్తున్న నిరుద్యోగులకు బిసి కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరు కోసం ఇచ్చిన నోటిఫికేషన్ నిరుద్యోగుల్లో ఆశలను చిగురించేలా చేసింది. ఈ మేరకు జిల్లాలో పెద్ద ఎత్తున బిసి సామాజిక తరగతికి చెందిన వివిధ కులాల యువకులు రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ మేరకు వివిధ పట్టణాల్లో కార్పొరేషన్లు మున్సిపాలిటీల ద్వారా గ్రామాల్లో ఎంపిడిఒ కార్యాలయాల ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులకు కౌన్సిలింగులను కూడా పూర్తిచేసి అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను జిల్లా ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లాలో 1656 రుణాలు లక్ష్యం కాగా 500 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. రూ.12 కోట్లు సబ్సిడీ అవసరం ఉన్నట్లు గుర్తించి మంజూరు కోసం బిసి కార్పొరేషన్ ఎండికి కూడా ప్రతిపాదనలు పంపారు. జిల్లా అధికారులు అన్ని సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ రుణాలు సొమ్మును విడుదల చేయడంలో మీనమేశాలను లెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని రుణాల మంజూరుకు ఎంపికైన లబ్ధిదారులు సబ్సిడీ మంజూరు కోసం ఆశగా ఎదురుచూస్తూ వస్తున్నారు.

రుణాల మంజూరులో మీనమేషాలు

ప్రస్తుతం రుణాల సొమ్ము ఆధారంగా మూడు స్లాబ్‌లను నిర్ణయించారు. కాగా ఆ స్లాబ్‌లను తాజాగా మార్పులు చేసే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రుణాల సబ్సిడీని గరిష్టంగా 35 శాతం నిర్ణయించింది. కాగా తాజాగా స్లాబ్‌లను తొలగించి అన్ని రుణాలకు గరిష్టంగా 50 శాతానికి సబ్సిడీని పెంచి గరిష్టంగా రుణం సొమ్ము రూ.2 లక్షలకు మించకుండా ఉండేలా యోచిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రుణాలు తమకు సకాలంలో అందుతాయో లేదోఅన్న అయోమయంలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే రుణాలను మంజూరు చేయాలని కోరుతున్నారు.

అర్హుల జాబితాను అధికారులకు పంపాం

-సయ్యద్‌జాకీర్ హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్ కర్నూలు

జిల్లాలో బిసి స్వయం ఉపాధి రుణాల అర్హుల జాబితా ప్రొసీడింగ్స్ ను కలెక్టర్ ద్వారా అప్రూవల్ తీసుకొని బిసి కార్పొరేషన్ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపాం. సబ్సిడీని గరిష్టంగా పెంచే యోచనను ప్రభుత్వం చేస్తుంది. తాత్కాలికంగా ప్రస్తుతం రుణాల మంజూరు ప్రక్రియను నిలుపుదల చేయాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

రుణాలు వెంటనే మంజూరు చేయాలి

డి. రాఘువేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

జిల్లాలో నిరుద్యోగుల స్వయం ఉపాధి కోసం బిసి కార్పొరేషన్ ఇస్తున్న రుణాలను వెంటనే మంజూరు చేయాలి. నిరుద్యోగులను ఆర్థికంగా ఆదుకోవాలి.

నగరానికి కొత్త శోభ తేవాలి

-మున్సిపల్ అధికారుల సమీక్షలో మంత్రి టిజి. భరత్
-ఆగస్టు ఆఖరు నాటికి పార్కులను తీర్చిదిద్దాలి
-రహదారులపై ఎక్కడా గుంతలు కనిపించకూడదు
-ప్రగతి పనులు పూర్తి చేయడంలో జాప్యం తగదు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్ది 'న్యూలుక్' కొత్తశోభ తేవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మున్సిపల్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. నూతన కమిషనర్ పి.విశ్వనాథపై ఉన్నతాధికారుల్లో మంచి అభిప్రాయం ఉందని, పనితీరు బాగుంటుందని మంత్రి కితాబిచ్చారు. విశాఖపట్నం తరహాలో నగరాన్ని తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సూచించారు. తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం పూర్తి అయిందని, ఇక మిగిలిన మూడున్నరేళ్ళలో, అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో ఎట్టిపరిస్థితుల్లోనూ కాలయాపన చేయొద్దని స్పష్టం చేశారు. పనులకు భూమిపూజ చేసిన తర్వాత నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని, పనులు పటిష్టంగా ఉండేందుకు ఇంకా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనులను చేపట్టకుండా జాప్యం చేస్తున్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజ్ విహార్ సమీపంలోని ఎల్లమ్మ గుడి నుండి జమ్మి చెట్టు వరకు హంద్రీ నది ఒడ్డున నిర్మిస్తున్న రహదారి పనులను వేగవంతం చేయాలని, బండ్ మరింత పటిష్టంగా ఉండేందుకు జలవనరుల శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రుసుముల మొండి బకాయిల వసూళ్లకు ప్రత్యేక యాక్షన్‌ప్లాన్ అమలు చేయాలని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకుల నాణ్యత సామర్థ్యాన్ని పరిశీలించాలని సూచించారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని, ఆగస్టు ఆఖరు నాటికి పార్కుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారులపై ఎక్కడా గుంతలు కనబడకుండా ఎప్పటికప్పుడు పూడ్చడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిసెంబర్ నాటికి 30 వేల మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఇ లీల ప్రసాద్, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, సూపరింటెండెంట్లు సుబ్బన్న, స్వర్ణలత, మంజూర్‌బాష, కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరావు పిలుపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన సిఐటియు కార్యాలయం కార్మిక కర్షక భవన్‌లో జిల్లా సిఐటియు కార్యకర్తల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెను కార్మికులు జయప్రదం చేయడం ద్వారా మోడీ ప్రభుత్వానికి హెచ్చరిక పంపారని తెలిపారు. దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేశారని అన్నారు. మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను మారుస్తూ లేబర్ కోడ్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తే మోడీకి బుద్ధి చెబుతారని అన్నారు. రాష్ట్రంలో ఉండే కూటమి ప్రభుత్వం మోడీ విధానాలను దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. పని గంటలు పెంచడం, రాత్రిపూట మహిళలు పనిచేయడానికి అనుమతులు ఇవ్వడం ద్వారా లేబర్ కోడ్స్‌ను అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధానాలు మార్చుకోకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని కోరారు. ప్రభుత్వం విద్యుత్తు రంగ సంస్థలో అనేక మార్పులను తీసుకొని వచ్చిందని అందులో భాగంగా స్మార్ట్ మీటర్లను బిగించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతారని తెలిపారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించి కార్యక్రమాలు పిలుపు ఇచ్చారన్నారు. జిల్లాలు, మండల స్థాయిలో జరిగే కార్యక్రమాలలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31నుంచి2026 జనవరి 4వరకు జరగబోతున్నాయని తెలిపారు. మహాసభల జయప్రదానికి కార్మికులు సిద్ధం కావాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు జిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను తెలిపారు. సిఐటియు జిల్లా నాయకురాలు శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిబాబా ,విజయ్, నారాయణస్వామి, ప్రభాకర్, గోపాల్, రాముడు, రాజశేఖర్, సుధాకరప్ప, బి.రాధాకృష్ణ, మెహమూద్, మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

బంగారు కుటుంబాల దత్తత పూర్తి కావాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెలాఖరులోగా బంగారు కుటుంబాల దత్తత పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పి4 పాలసీ అమలుపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీరో పావర్టీ పి4 పాలసీ అమలులో భాగంగా జిల్లాలో 64128 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. గ్రామాలు, వార్డుల్లో ఈ నెల 15 నుండి 25 వరకు గ్రామసభలను నిర్వహించాలన్నారు. గ్రామ సభల్లో బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పరిశీలన చేసి, అర్హులైన వారితో తుది జాబితాను తయారు చేయాలన్నారు. ఈ నెల 31న నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం అంటే ఆర్థికంగా సాయం చేయడం అని అనుకోకూడదన్నారు, చదువు, ఉద్యోగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకునేలా సరైన విధంగా మార్గదర్శనం చేసి ఆ కుటుంబాన్ని అభివృద్ధి చేయడం కూడా ఇందులో భాగమని తెలిపారు. మార్గదర్శులను గుర్తించేందుకు గ్రామ కమిటీలు వేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామానికి ఒక అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించాలన్నారు. కుటుంబ అవసరాలు, వ్యక్తిగత అవసరాలు, గ్రామ అవసరాలు ఏవైనా తోడ్పాటు అందించవచ్చని, అవసరాలను గుర్తించేందుకు నిర్వహించే సర్వేను జాగ్రత్తగా చేయాలన్నారు. గ్రామాల్లో స్థితిమంతులుగా ఉన్నవారు, బాగా చదువుకున్నవారు, ఉద్యోగులు, వైద్యులు, గ్రామపెద్దలు తదితరులను మార్గదర్శకులుగా గుర్తించా లన్నారు. ఇందుకోసం గ్రామానికి ఒక సచివాలయ సిబ్బందిని ఇంచార్జి గా పెట్టాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. ప్రయివేటు స్కూల్ మేనేజ్‌మెంట్స్, ఇండస్ట్రీస్, డాక్టర్స్ తదితరులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఆదుకునే అవకాశం ఉన్న మంచి కార్యక్రమని, మానవతా కోణంలో ఆలోచించి అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తిచేశారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పి4 పాలసీ స్టేట్ కన్సల్టెంట్ స్పర్శ్, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, ఇండస్ట్రీస్ జిఎం జవహర్‌బాబు, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ , డిపిఒ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ భద్రత

కర్నూలు క్రైమ్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లా మల్యాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ నుండి నీటిని విడుదల చేసే కార్యక్రమంలో భాగంగా కర్నూలు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకోనున్న సంధర్భంగా కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సంధర్భంగా పోలీసు బందోబస్తు, తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రోటో కాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎయిర్‌పోర్టులో ప్రవేశ, నిష్క్రమణల దగ్గర బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డిటిసి శాంతకుమారి, కర్నూలు డిఎస్‌పి జె బాబు ప్రసాద్, భాస్కర్ రావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ తేజమూర్తి, కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు, సిఐలు మహేశ్వర రెడ్డి, యస్వంత్, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు మాబూని, తదితరులు (కోలుకున్న తల్లీ బిడ్డ)

అమీలియోలో హైరిస్క్ ఆపరేషన్

-ఆపరేషన్ విజయవంతం-తల్లీ బిడ్డ క్షేమం
-వైద్యులుకు ఎండి డాక్టర్ లక్ష్మీప్రసాద్ అభినందన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అధిక రక్తస్రావం.. ప్లేట్ లెట్ కణాలు తగ్గిపోవడం.. రక్త పోటు కంట్రోల్ లేని సమయంలో ఆస్పత్రిలో చేరిన ఓ గర్భిణీకి విజయవంతంగా ఆపరేషన్ చేసి కుటుంబీకుల మన్ననలు పొందారు అమీలియో ఆస్పత్రి వైద్యులు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ మాబూని, అనస్థిసియా వైద్యులు డాక్టర్ విజేత మాట్లాడారు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన గర్భిణీ స్వప్న మూడు రోజుల క్రితం చికిత్స కోసం కర్నూలు నగరం అమీలియో ఆస్పత్రిలో చేరారు. అప్పటికే పలు ఆస్పత్రులలో చేర్పించేందుకు ప్రయత్నించినా..ఆయా ఆస్పత్రులు హైరిస్క్ సర్జని అని అడ్మిట్ చేయించుకోలేదని భర్త రాజు తెలిపారు. ఆపరేషన్ సమయంలో గర్భిణీ స్వప్న ప్లేట్‌లెట్ కణాలు లక్షా 50వేలు ఉండాల్సి ఉండగా 20వేలు మాత్రమే ఉన్నాయి. బీపీ 200/140 తోపాటు అధిక రక్త స్రావంతో బాధపడుతూ ఉంది. వాటన్నిటినీ కంట్రోల్ చేస్తూ.. ఆపరేషన్ ను పూర్తి చేశారు వైద్యులు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని గైనకాలజిస్ట్ డాక్టర్ మాబూని వెల్లడించారు.

వైద్యలకు అభినందన : నగరంలోని అమీలియో హాస్పిటల్ లో హై రిస్క్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేస్తున్నామని ఆస్పత్రి ఎండి డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ చాపే తెలిపారు. ఈ నెల 3న కడుపునొప్పితో బాధ పడుతున్న 12 ఏళ్ల బాలికకు రిసెక్షన్ అండ్ అనాస్టమోసిస్ ఆపరేషన్ చేసి.. ఆ బాలికకు కడుపు నొప్పి నుంచి ఉపశమనం కలిగించామన్నారు. ప్రస్తుతం హై రిస్క్‌లో ఉన్న గర్భిణీకి మనోధైర్యమిచ్చి ఆపరేషన్‌ను సక్సెస్ చేసిన గైనకాలజిస్ట్ వైద్యంలు డాక్టర్ మాబూని, అనస్థీయా వైద్యులు డాక్టర్ విజేతకు ఆస్పత్రి ఎండి డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

పుకార్లు నమ్మకండి :ఎంపిడిఒ కవిత

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలోని 3వ సచివాలయాన్ని ఏ ప్రభుత్వ అధికారికి కేటాయించలేదని పత్తికొండ ఎంపిడిఒ కవిత పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో పత్రిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 11, 12, 13 ,14, 15 వార్డు ప్రజలు పుకార్లు మాటలు విని మోసపోకండి. 3వ సచివాలయంలో యధావిధిగా ప్రభుత్వ సేవలు కొనసాగుతాయని అన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ వైద్యులకు తగిన గుర్తింపు తెస్తాం

ఉమ్మడి జిల్లా గ్రామీణ వైద్యుల మహాసభలో రాష్ట్ర మంత్రి టిజీ భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గ్రామీణ వైద్యుల మహాసభలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

గ్రామీణ వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తగిన గుర్తింపు కోసం కృషి చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, ఎంపీ, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. కర్నూలు నగరంలోని బిర్లా గేట్‌పక్కన ఉన్న లక్ష్మీ కళ్యాణం మండపంలో ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రామీణ వైద్యుల మహాసభ డాక్టర్ కెజి.గోవిందరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, తెలుగుదేశం పోలిట్ బ్యూరో సభ్యులు మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్దన్, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శామ్‌కుమార్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి, గుడివాడ మాజీ మేయర్ వరప్రసాదు హాజరయ్యారు. మంత్రి టిజి. భరత్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు గ్రామీణ వైద్యులపైన అపారమైన నమ్మకం ఉంటుందన్నారు. మీ సేవలు కచ్చితంగా ప్రభుత్వం వినియోగించుకునేలా మా వంతుగా సహకరిస్తామని తెలిపారు. పోలిట్ బ్యూరో సభ్యులు మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్దన్ మాట్లాడుతూ ఈరోజు గ్రామాల్లో గ్రామీణ వైద్యుల సేవలు చాలా ఉపయోగపడుతున్నాయని, వారి సేవలు వినియోగించుకునేలా ప్రభుత్వ దష్టికి తీసుకువస్తానని తెలిపారు. ఎమ్మెల్యేలు గౌరుచరితరెడ్డి, శ్యాంబాబు మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో గ్రామీణ వైద్యుల గురించి మాకు చక్కటి అవగాహన ఉందని,అవకాశాన్ని బట్టి అసెంబ్లీలో సేవలను ప్రస్తావిస్తూ గుర్తింపునకు మా వంతుగా కచ్చితంగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కెజి.గోవిందరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్స చేస్తూ పేద ప్రజలకు సేవ చేస్తున్నారని, ఒక ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోనే దాదాపు 60 వేలకు పైగా గ్రామీణ వైద్యులు ఉన్నారని తెలిపారు. అవసరమైతే దేశావ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపిల సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని సభాముఖంగా తెలిపారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకష్ణ, సెక్రెటరీ ఎంఎన్ రాజు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దస్తగిరి పర్ల, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు విబిటి రాజు, బల్లా శ్రీనివాస్ , గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం కర్నూలు జిల్లా సెక్రెటరీ ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి రఘునాథరెడ్డి, జిల్లా నాయకులు నరసింహా, ఉస్మాను, నంద్యాల జిల్లా నాయకులు సంయుక్త కార్యదర్శి నాగేశ్వరావు , సెక్రెటరీ సురేష్ బాబు, కోశాధికారి సురేంద్ర,ఉమ్మడి జిల్లాల నుంచి భారీగా ఆర్ఎంపిలు పాల్గొన్నారు.

పందులు, దోమలు భరించలేక పోతున్నాం

-స్థానికులు ఆవేదన

పట్టీపట్టనట్లు కార్పొరేషన్ అధికారులు: పిపిఎస్ఎస్

ఇళ్ల మధ్య కదలని మురుగు కాలువను పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :ఇళ్ళ ముందు మురుగు నీరు నిలిచి.. చెత్తాచెదారం పేరుకుపోయి పందులకు, కుక్కలకు, దోమలకు నిలయంగా మారి భరించలేని దుర్వాసన తో ఇండ్లలోనే ఉండే పరిస్థితి ఏర్పడిందని ప్రేమనగర్ కాలనీ ప్రతినిధులు రిటైర్డ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, ఎంఇఒ టి.శరభయ్య, ఆర్‌జిబి మేనేజర్ కె.కృష్ణ మూర్తి, పట్టణపౌర సంక్షేమ సంఘం(పిపిఎస్ఎస్) నాయ కులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పిపి ఎస్-ఎస్ ప్రతినిధి బృందం స్థానికులతో కలిసి కాలనీలో పర్య టించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధి కారులకు ప్రజా ప్రతిథులకు ఎన్నిసార్లు చెప్పినా మా సమస్య పరిష్కారం కావడం లేదని అన్నారు. పిపి ఎస్ఎస్ నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు ఏడాదికి ఒకసారి ఇంటి పన్నులు పెంచుతూ ప్రజలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా నేల విడిచి సాము చేస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపి ఇంటి సమీపంలో చెత్తాచెదారంతో డంపుయార్డును తలపిస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా, బాగున్న కాలువలు, రోడ్లు కూలగొట్టి మళ్లీ నిర్మిస్తూ ప్రజాధనం వృధా చేస్తున్నారని తెలిపారు. నగరంలో కొన్ని కాలనీలపై వివక్షత చూపు తున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా పాలకవర్గం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. ఈ పర్యటనలో రిటైర్డ్ ఎస్ఐ కాడప్ప, ఎ.వెంకటేశ్వర్లు, సివి.వర్మ, కె.శ్రీనివాసులు, మాలిక్ భాష, ఆంజనేయులు గౌడ్, సురేంద్ర, సుబ్రమణ్యం, విజయ్, హాజీ పాల్గొన్నారు.

జెండా ఊపి వన్ కె ర్యాలీని ప్రారంభిస్తున్న జస్టిస్ జి.కబర్ధి

మధ్యవర్తిత్వం పై వన్'కె' ర్యాలీ

ప్రజాశక్తి -కకర్నూలు లీగల్

సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వ విభాగం సూచనలతో రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి , అధ్యక్షులు జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి దివాకర్, కర్నూలు బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ హరినాథ్ చౌదరి బుధవారం మధ్యవర్తిత్వం పై వన్ కె ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కర్నూలు న్యాయ సేవా సదన్ జిల్లా కోర్ట్ ప్రాంగణం నుండి మున్సిఫ్ కోర్ట్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ నుండి కొండారెడ్డి బురుజు వరకు సాగింది. జిల్లాజడ్జి మాట్లాడుతూ ప్రజలకు మీడియేషన్ వలన కలిగే లాభాలు , మీడియేషన్ ఉపయోగించి కేసులను త్వరగా ఎలా పరిష్కరించుతారో తెలిపారు. ఈ ర్యాలీలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకట హరినాథ్, అదనపు జిల్లా జడ్జిలు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, బార్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, శిక్షణ పొందిన మీడియేషన్ న్యాయవాదులు నాగశేషయ్య, యువి.లక్ష్మి,ఉమాదేవి, ఆశ బాయి, న్యాయవాదులు పి.నిర్మల, ప్యారా లీగల్ వాలంటీర్స్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయులతో రిటైర్డ్ ఐజి

హైస్కూల్‌ను దత్తత తీసుకున్న విశ్రాంత ఐజి

ప్రజాశక్తి-సి బెళగల్

విశ్రాంత ఐజి స్థాయి అధికారి షేక్ మహమ్మద్ సి బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకున్నట్లు బుధవారం పేర్కొన్నారు. ఇక్కడ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో ఆ పాఠశాలను సందర్శించి వెంటనే ఒక తాగునీటి బోరును వేయించారు. పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి కావలసిన ప్రణాళికను రూపొందించి తక్షణమే అమలు చేసే విధంగా స్థానిక తహశీల్దార్‌ను కోతుతామన్నారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థుల్లో మొబైల్ ఫోన్ అనవసర వినియోగం గురించి వివరించారు. పదవ తరగతి విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి 80 శాతం రిజల్ట్ తీసుకురావాలని సలహాలు సూచనలు అందించారు. మండలంలోని ఔత్సాహకుల నుండి డొనేషన్స్ రూపంలో పాఠశాలకు కావలసిన సదుపాయాలు కల్పించడానికి కృషి చేయాలని స్థానిక ఎస్ఎంసికమిటీ ఛైర్మన్ ఎం.గోవిందు వారిని కోరారు. హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నదీతీరంలో పోలీసు, సెక్యూరిటీ పహారా

ప్రజాశక్తి - మంత్రాలయం

పహారా నిర్వహిస్తున్న పోలీసులు

తుంగభద్ర నదీతీరంలో భక్తులు నదిలోకి వెళ్లకుండా పోలీసు, సెక్యూరిటీ సిబ్బంది పహారా కాస్తున్నారు. తుంగభద్ర నది వరద ఉధృతి కొంత తగ్గినప్పటికీ.. ఇటీవల కర్ణాటకకు చెందిన ముగ్గురు విద్యార్థులు నదిలో స్నానానికి వెళ్లి మృతి చెందడంతో పోలీసు శాఖ, శ్రీరాఘవేంద్ర స్వామి మఠం అధికారులు అప్రమత్తమయ్యారు. మళ్లీ అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నదీతీరంలో నిఘా ఉంచారు. అందులో భాగంగానే ఎస్ఐ శివాంజల్ తుంగభద్ర నదీతీరంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, ఎస్‌డిఆర్ఎఫ్ బృందం, శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బంది చేస్తున్న భద్రతను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భక్తులు స్నానాలకు శ్రీమఠం అధికారులు పంచాయతీ శాఖ నుంచి షవర్లను ఏర్పాటు చేశారని, భక్తులు అక్కడ పుణ్య స్నానాలు చేసి వెళ్లాలని ఎస్ఐ శివాంజల్ కోరారు.

గోవిందప్ప స్వామి దేవాలయంలో చోరీ

- 40 తులాల వెండి ఆభరణాలు, హుండీలో కానుకల అపహరణ

ప్రజాశక్తి - చిప్పగిరి

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

చిప్పగిరి బస్టాండ్ సమీపంలో ఉన్న గోవిందప్ప స్వామి ఆలయంలో బుధవారం తెల్లవారు జామున దొంగతనం జరగడం కలకలం రేపింది. 40 తులాల వెండి ఆభరణాలు, హుండీలోని సుమారు రూ.20 వేలు దొంగలించినట్లు చెప్పారు. గ్రామస్తులు, పూజారి శివ ఇచ్చిన వివరాల మేరకు చిప్పగిరి ఎస్ఐ ఎ.శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలం దేవాలయం వద్దకు వెళ్లి పూజారిని విచారించారు. అనంతరం అనుమానితుల వేలిముద్రలను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ... దొంగతనం చేసిన వ్యక్తులను కచ్చితంగా పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దేవాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే : చిప్పగిరి గోవిందప్ప స్వామి దేవాలయంలో దొంగతనం జరగడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆలయంలో దొంగతనం చేయడం మంచిది కాదని తెలిపారు. ఇలాంటి వ్యక్తులు ప్రజాస్వామ్యంలో ఉన్నారంటే బాధాకరమన్నారు. దొంగతనం చేసిన వ్యక్తులను వెంటనే పట్టుకొని చట్టపరంగా శిక్షించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. అనంతరం గ్రామస్తులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గోవిందప్ప స్వామి దేవాలయం ప్రసిద్ధి చెందినదని తెలిపారు. ఇలాంటి దేవాలయంలో దొంగతనం చేయడం ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే సోదరులు శ్రీరాములు, వెంకటేష్, గ్రామ పెద్దలు ఉన్నారు.

వంతెన కోసం పరిశీలించిన పీడీ

ప్రజాశక్తి - హాలహర్వి

గ్రామంలో పర్యటిస్తున్న పీడీ

మండలంలోని నిట్రవట్టి గ్రామంలో వంతెన కోసం డ్వామా పీడీ వెంకట రమణయ్య పరిశీలించారు. జూన్ 13న తేజప్ప అనే వ్యక్తి పెద్దవాగుకు వంతెన లేక మృతి చెందారు. అలాగే అంబులెన్స్ ఊరికి వచ్చినా వారి ఇంటి దగ్గరకు రాలేక ఆవతలే ఆగిపోయింది. జడ్‌పిటిసి లింగప్ప, గ్రామస్తులు... తాత్కాలిక వంతెన వేయాలని కోరడంతో బుధవారం డ్వామా పీడీ వెంకటరమణయ్య పరిశీలించారు. నిట్రవట్టి గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ... వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, అవసరమైన నిధుల కోసం కలెక్టర్ నివేదిక అందిస్తామని తెలిపారు. ఈఈ వెంకటేశ్వర్లు, ఏపీడీ పక్కీరప్ప, డీఈ మనోహర్, పీఆర్ సోమప్ప, ఏపీవో చక్రవర్తి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ... గ్రామస్తుల వసతుల్ని ఇబ్బందుల దృష్ట్యా ఉంచుకొని ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు వివరించారు.

ఇంటర్‌కు దరఖాస్తులు ఆహ్వానం

- ప్రిన్సిపల్ పుష్పలత

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం కెజిబివిలో ఇంటర్మీడియట్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పుష్పలత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇంటర్‌లో ఎంపిసి గ్రూపు ఇంగ్లీష్ మీడియం ఉందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 6వ నుంచి 10వ తరగతి వరకు 2025-26 విద్యా సంవత్సరం అడ్మిషన్లు పూర్తయ్యాయని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యా సమాచారం కోసం విద్యాలయంలో సంప్రదించవచ్చని చెప్పారు.

నడి రోడ్డుపై గుంత

- ప్రయాణికుల ఇబ్బందులు
- 8 నెలలుగా అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో నడి రోడ్డుపై గుంతపడి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండ్ ప్రాంతంలో నాగలదిన్నె వెళ్లే మార్గంలో సుమారు నాలుగు అడుగుల వెడల్పు సిసి రోడ్డుపై గుంత పడింది. అదే రోడ్డుపై ఒక 50 అడుగుల దూరంలో రోడ్డు పగిలి.. అందులో ఉన్న డ్రెయినేజీ పైపు పగిలిపోయింది. ఈ రహదారి ఎమ్మిగనూరు నుంచి గద్వాల్ వరకు విస్తరించి ఉంది. ఈ రహదారిపై రోజూ వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. గ్రామంలోని ప్రయాణికులు, రైతులు, ప్రజలు వేల సంఖ్యలో ఈ రహదారిపై ప్రయాణిస్తూ ఉంటారు. ఈ రోడ్డుపై గుంత ఏర్పడి సుమారు 8 నెలలకు పైగానే అయింది. ఇప్పటివరకు ఆ గుంత, డ్రెయినేజీలో చాలా సందర్భాల్లో బస్సులు, లారీలు ఇరుక్కుపోవడం, స్కూటర్లపై వెళ్లే

డ్రెయినేజీ పగిలి దుర్భరంగా తయారైన రహదారి

ప్రయాణికులు పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఆ ప్రదేశాల్లో రోజూ ఏదో ఒక సమయంలో కనీసం 20 నిమిషాలైనా వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఇన్ని నెలలుగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. ప్రతి అధికారీ ఈ ప్రదేశాలను చూస్తూ వాటిపై ప్రయాణిస్తున్నారు తప్ప సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన కూడా రావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఆ గుంత చుట్టూ ప్రమాదం జరగకుండా ఏవైనా చిన్నపాటి రాళ్లు కూడా పెట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. సమస్యను త్వరగా పరిష్కరిస్తామని ఆర్అండ్‌బి అధికారి విజయ్ నరేష్ తెలిపారు.

రిజర్వాయర్లకు నీటి విడుదల

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని సాతనూరు గ్రామ సమీపంలో ఉన్న పులికనుమ పంప్ హౌస్, మూగలదొడ్డి పంప్ హౌస్ నుంచి బుధవారం ఎఇ ప్రేమ్ ఆధ్వర్యంలో టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి మోటార్ ఆన్ చేసి రిజర్వాయర్లకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోరుతోందని తెలిపారు. 1.2 టిఎంసిల నీరు సామర్థ్యం గల పులికనుమ ప్రాజెక్టులో 100 క్యూసెక్కుల తుంగభద్ర జలాలను పంప్ హౌస్ ద్వారా విడుదల చేసినట్లు చెప్పారు. మూగలదొడ్డి రిజర్వాయర్‌కు తుంగభద్ర జలాల నుంచి 30 క్యూసెక్కుల నీరు పంపింగ్ ద్వారా విడుదల చేశామన్నారు. ఈ నీరు సాగు, తాగేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం ఒక మోటార్ ఆన్ చేసినట్లు, ఈ నీటితో ప్రస్తుతం 3,800 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో అగసనూరు గ్రామ సమీపంలో ఉన్న ఆర్‌డిఎస్ కుడి కాలువ పనులు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నట్లు చెప్పారు. టిడిపి నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, వక్రాణి వెంకటేష్, జ్ఞానేష్, చింతలగేరి నర్సిరెడ్డి, హోళగుంద కోసిగయ్య, రామకృష్ణ, తాయన్న, గౌస్, కలందర్, నూరి, నాగేంద్ర, నజీర్, వెంకటేష్ పాల్గొన్నారు.

మోటార్ ఆన్ చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

రైతులందరికీ సాగునీరందిస్తాం

- తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్

ప్రజాశక్తి - కౌతాళం

పూజలు నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని రైతులందరికీ సాగునీరు అందిస్తామని తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్ తెలిపారు. బుధవారం తుంగభద్ర దిగువ కాలువలో నీరు ఆంధ్ర సరిహద్దులోకి చేరుకోవడంతో ఎల్ఎల్‌సి అధికారులు డిఇ మహ్మద్ షఫీవుల్లా, డిఎస్ఒ మాధవరెడ్డి, సూపరింటెండెంట్ ఉషారాణి, సాగునీటి సంఘం అధ్యక్షులు రంగస్వామి, ఎల్ఎల్‌సి జెఇ ఈశ్వర్ అధికారులతో కలిసి పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా టిప్పు సుల్తాన్ మాట్లాడారు. చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తుంగభద్ర దిగువ కాలువ కింద రైతులందరూ మంచి పంటలు పండించాలని కోరారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందితే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. రైతులకు ప్రభుత్వ సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. టిడిపి నాయకులు మారెప్ప, దొడ్డన్న గౌడ్, కరి బసప్ప గౌడ్, హుస్సేన్ బాష పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాల ఎంపికలో విద్యార్థులకు అన్యాయం

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు కార్తీక్ నాయుడు, గంగాధర్, దేవరాజు, చంద్రశేఖర్, ఈశ్వర్, రామాంజనేయులుకు స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలో అన్యాయం జరిగిందని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కర్నూలు డిఎస్ఎ కార్యాలయంలో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ పిల్లలు రన్నింగ్ రేస్, స్పోర్ట్స్‌లో మంచి మెరిట్ సాధించినా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డిఎస్ఎ) భూపతిరావు రాజకీయ ప్రోద్భలానికి, డబ్బులకు లొంగి స్పోర్ట్స్ స్కూల్‌లో సీటు రాకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌కు సంబంధించి ఏవైనా అప్లికేషన్లు లేకుంటే సమయం ఇవ్వాలని కోరారు. కోసిగి మండలం నిరక్షరాస్యతకు మారుపేరని, అలాంటిది మెరిట్ సాధించిన విద్యార్థులకు కాకుండా, ఏమాత్రం ప్రతిభ కనబరచని విద్యార్థులను ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ చేసి డిఎస్ఎ భూపతిరావుపై చర్యలు తీసుకుని, విద్యార్థులకు మరో అవకాశం ఇచ్చి సీటు వచ్చేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

'కూటమి'తోనే సుపరిపాలన : ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్లలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

హాలహర్విలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ బీటీ, నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే, పిఎసి సభ్యులు డాక్టర్ డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అలువాల, చిన్నమరివీడు గ్రామాల్లో పర్యటించి సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు. చిన్నమరివీడు గ్రామంలో సుమారు రూ.20 లక్షలతో అల్వాల ఎస్ఎస్ ట్యాంకి నుంచి గ్రామంలోకి ఏర్పాటు చేసిన నూతన తాగునీటి పైపులైన్‌ను మోటారు ఆన్ చేసి ప్రారంభించారు. అల్వాల గ్రామంలో టిడిపి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పనులను వివరించారు. గ్రామంలో డ్రెయినేజీ, సిసి రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య, కైరవాడి తిమ్మారెడ్డి, అలవాల సర్పంచి బాష, చిన్నమరివీడు శ్రీను, తహశీల్దార్ రాజేశ్వరి, ఎంపిడిఒ మణిమంజరి పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని గూడెం గ్రామంలో 'సుపరిపాలన తొలి అడుగు' నిర్వహించారు. బీటీ.నాయుడు పాల్గొని ముందుగా శ్రీశరణ గాది లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మండల కన్వీనర్ సుధాకర్ అధ్యక్షతన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. ఆలూరు నియోజకవర్గ పరిశీలకులు పూల నాగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధి కృష్ణ నాయుడు, ఎల్ఎల్‌సి డిస్ట్రిబ్యూటరీ ప్రెసిడెంట్ మల్లప్ప, జడ్‌పిటిసి లింగప్ప పాల్గొన్నారు. **కోసిగి** మండలంలోని సాతనూరు గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు జ్ఞానేష్, సీనియర్ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు చింతలగేరి నర్సరెడ్డి అధ్యక్షత వహించారు. టిడిపి నాయకులు వక్రాణి వెంకటేశ్వర్లు, హోళగుంద కోసిగయ్య, తాయన్న, టంకం గౌస్, నూరి, సాతనూరు వెంకటేష్, నజీర్, నాగేంద్ర, రామిరెడ్డి, మహాదేవప్ప, ఈరన్న, ప్రభు, రాజు, పీర్ బాబు, విరుపాక్షి పాల్గొన్నారు. **ఆస్పరి** మండలం బిల్లేకలు, వలగొండ, పుట్టకల మర్రి, ముత్తుకూరు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. టిడిపి మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు, తెలుగు యువత ఆలూరు ఉపాధ్యక్షులు మహేష్, సీనియర్ నాయకులు మధు, టిడిపి నాయకులు యుగంధర్, వేణు పాల్గొన్నారు.

కోసిగిలో కరపత్రాలు పంచుతున్న టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ఆస్పరిలో పథకాల గురించి వివరిస్తున్న టిడిపి నాయకులు

విలీనం వద్దు..!

- విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన
- ఇదే పాఠశాల ఉండాలంటూ పాఠశాల వద్ద నిరసన
- మా పిల్లలకు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు

ప్రజాశక్తి - మంత్రాలయం

స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల ప్రధాన పాఠశాలలోకి విలీనం చేయవద్దని పాత పాఠశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. బుధవారం రామచంద్ర నగర్ కాలనీ వాసులకు సమీపంలో ఉన్న ఎంపిపి పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయం సేకరించకుండా, ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా నిరక్షరాస్యత కలిగిన ఛైర్మన్ చిట్టెమ్మతో వేలు ముద్ర వేయించి జిల్లా అధికారులను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. సంత మార్కెట్‌లో ఉన్న పాఠశాల పురాతనమైందని, వర్షం వస్తే లోపలికి నీరు చేరుతాయని చెప్పారు. పాఠశాలకు వెళ్లాలంటే భయమేస్తోందని తెలిపారు. అలాగే పాఠశాలకు వెళ్లాలంటే ప్రధాన రహదారిలో కానీ, సుజయీంద్ర నగర్ కాలనీకి వెళ్లే రహదారిలో వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. ఎప్పుడూ వాహనాలు తిరుగుతూ ఉంటాయని, పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఏదైనా ప్రమాదం జరిగి ఊరి బయట చనిపోయిన వారి మృతదేహాలను సంత మార్కెట్‌లో బంధువుల సందర్శనార్థం ఉంచుతారని, అలాంటి సమయంలో తమ పిల్లలు భయపడతారని చెప్పారు. తుంగభద్ర నది కూడా దగ్గరవుతుందని, అటువైపు వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. రామచంద్ర నగర్ కాలనీ వాసులకు పాత పాఠశాలలో ఉంచాలని కోరారు. గత 25 ఏళ్లగా ఉన్న ఎంపిపి పాఠశాలను మార్చేందుకు అంగీకరించేది లేదని తెలిపారు. ఇప్పటికీ తమ పిల్లలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లు ఇవ్వలేదని, వెంటనే ఇచ్చి ఇక్కడే పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు అనిల్, తల్లిదండ్రులు శాంతి, శకుంతలమ్మ, సునీల్ కుమార్, ఎం.ఎం.ఈరన్న పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న తల్లిదండ్రులు

ఆదోని అభివృద్ధికి కృషి

- లోకేష్‌ను కలిసిన మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌న్ కలిసి విన్నవించామని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదోని పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే ఎస్ఎస్ ట్యాంకు పటిష్టతకు చర్యలు తీసుకోవాలని, జనాభాకనుగుణంగా మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలని విన్నవించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించి వెంటనే పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారన్నారు.

నైపుణ్యతతో ఉన్నత చదువులు

ప్రజాశక్తి - దేవనకొండ

విద్యార్థుల్లో చదువుతో పాటు, క్రీడ, ఇతర రంగాల్లో ఉన్న నైపుణ్యతతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయరామ్ తెలిపారు. బుధవారం ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం సందర్భంగా తెర్నేకల్ జిల్లా పరిషత్ పాఠశాలలో వృత్తి విద్య ఉపాధ్యాయులతో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రధానోపాధ్యాయులు జయరామ్, జడ్జిగా ఉపాధ్యాయులు రాధిక, హేమలత ఆధ్వర్యంలో డయాగ్రమ్ కాంపిటీషన్, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రధానోపాధ్యాయులు, జడ్జి చేతులమీదుగా బహుమతుల ప్రదానం చేశారు.

బహుమతులు అందజేస్తున్న అతిథులు

అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానం : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి కోరారు. బుధవారం ఆమె మాట్లాడారు. వృత్తి విద్యలో ఉన్న ఈటి ఎలక్ట్రిషియన్, టెక్నీషియన్ కోర్సులో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బిటెక్ (ఇఇఇ) అర్హత కలిగి ఉండి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈనెల 18లోపు దరఖాస్తులు కళాశాలలో అందజేయాలన్నారు. 19న ఇంటర్వ్యూ, డెమో క్లాసుకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

పైసలిస్తేనే.. పొలం కొలతలు...

- మండల మీట్‌లో ప్రజాప్రతినిధుల ఆరోపణ

ప్రజాశక్తి- దేవనకొండ

రైతుల పొలాలను కొలతలు వేయించుకోవాలంటే పైసలు ఇవ్వనిదే పని చేయడం లేదని ఎంపిటిసి తపాల శ్రీనివాస నాయుడు విమర్శించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశం భవనంలో ఎంపిపి లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యుల విమర్శకు స్పందించిన తహశీల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ... తాను ఇటీవలే తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టానని, విచారించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య నివారణకు నిధులు కేటాయించాలని తెర్నేకల్లు సర్పంచి అరుణ్ కుమార్ సభా దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిడిఒ జ్యోతి మాట్లాడుతూ... అత్యవసర పారిశుధ్య నివారణకు మండల పరిషత్ నిధుల ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణదారులు రైతులకు క్రిమిసంహారక మందులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఎంపిటిసి శ్రీనివాస్ నాయుడు విమర్శించారు. అందుకు ఎఒ ఉషారాణి సమాధానమిస్తూ... అధిక ధరలకు విక్రయించే దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పశు వైద్యాధికారి వెంకటేష్ మాట్లాడుతూ... 50 శాతం సబ్సిడీతో పశువుల దాణా రైతులకు అందించామని, పశు బీమా పథకాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పల్లెదొడ్డి గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ తీగలు వేయలేదని ఎంపిటిసి తిమ్మప్ప విద్యుత్ ఇంజినీర్ రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సమాధానమిస్తూ... తమ సిబ్బందితో స్తంభాలకు కనెక్షన్ ఇప్పిస్తామని తెలిపారు. ఎంఇఒలు తిమ్మారెడ్డి, విజయనిర్మల, ఐసిడిఎస్ సిడిపిఒ మద్దమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీ విజయ్, పిఆర్ ఎఇ ఉదయ భాస్కర్ తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రామాంజనేయులు

వాల్మీకి నాయకునికి సొసైటీ ఛైర్మన్ దక్కేనా..?

- టిడిపి ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న సీనియర్ నాయకుడు
- అధిష్టానం ఆశీస్సులు వాల్మీకులకు దక్కుతాయా..?
- బెల్డోన సొసైటీ ఛైర్మన్ గిరి కోసం కొండ గోవిందు ఎదురుచూపు

ప్రజాశక్తి - చిప్పగిరి

టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన వాల్మీకి సీనియర్ నాయకుడు, చిప్పగిరి కొండ గోవిందప్పకు బెల్డోన సహకార పరపతి సంఘం అధ్యక్షుని స్థానం దక్కుతుందా... లేదా అన్నది మండలంలో ప్రశ్నగా మిగిలింది. టిడిపి ఆవిర్భావం నుంచి కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు కోసం, పార్టీ అభివృద్ధి కోసం వాల్మీకి సీనియర్ నాయకుడు కొండా గోవిందప్ప కృషి చేశారు. బెల్డోనా సొసైటీ బ్యాంకు ఛైర్మన్ కోసం కొన్ని నెలల నుంచి అధిష్టానానికి విన్నవించి ఎదురుచూస్తున్నారు. ఆలూరు నియోజకవర్గంలో టిడిపిలో గ్రూపులు ఉండడం, మూడు గ్రూపుల నుంచి బెల్డోనా సొసైటీ ఛైర్మన్ కోసం వారి వారి అనుచర మద్దతుదారులను ఇప్పటికే అధిష్టానానికి విడివిడిగా ఎవరికి వారు పంపినట్లు పార్టీలో వినికిడి. ఆలూరు నియోజకవర్గంలో వాల్మీకులు అధిక జనాభా ఉండడమే కాకుండా, చిప్పగిరి మండలంలో కూడా వాల్మీకులు ఎక్కువగా ఉన్నారు. జనాభా ఉన్న వారికి పార్టీ పట్టం కడుతుందా, లేక అగ్రవర్ణాలకు పట్టం కడుతుందా అని వాల్మీకులు ఎదురుచూస్తున్నారు. వాల్మీకులకు న్యాయం జరగాలంటే వాల్మీకి నాయకునికి ఛైర్మన్ ఇవ్వాలని వాల్మీకి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి ఛైర్మన్ ఇవ్వాలని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ అధిష్టానానికి లెటర్ ద్వారా తెలియజేసినట్లు వాల్మీకి సీనియర్ నాయకుడు కొండా గోవిందప్ప బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... టిడిపి బడుగు, బలహీన వర్గాల పార్టీ అని, తనకు కచ్చితంగా ఛైర్మన్ పదవి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడుగు, బలహీన వర్గాల అభ్యర్థులకు అన్ని నియోజకవర్గాల్లో, మండలాల్లో పెద్దపీట వేసి వాల్మీకులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు గుర్తు చేశారు. తాను అధిష్టానం ఆదేశాల మేరకు మండలంలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.


మాట్లాడుతున్న కొండ కరి గోవిందు

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE (JUNIOR DIVISION)::ALUR
OS No.244/23

Between-
Smt Siddamma and another's. ...Plaintiffs
AND
Smt Kambali Rangamma & others. ...Defendants

SUMMONS TO DEFENDANTS. D4 & D5

To, D4 & D5
D4. Smt. Kambali Dadda Earamma W/o Badari, D/o Kambali Devanna, R/o Holagunda Village & post and Madal, Alur Taluka, Kurnool District
D5. Smt. Kambali Sanna Eramma W/o Gangadara, D/o Late Kambali Devanna, R/o Badinihal Village, & post Kowthalam Mandal, Adoni Taluka, Kurnool Dist.

Where the above named Plaintiffs filed the above suit against the defendants for partition suit of Plaintiffs with a request to come and join the plaintiffs and to discharge all material objections.

You are hereby directed to appear before this The Hon'ble Court either directly or through Counsel on 01-08-2025 at 10:30 am A..? Filling which, the matter will be decided in your absence.

By Order of the Court.
Smt. P. Jyothi.
Advocates for Plaintiffs
R/o ALUR,
Mobile No: 94803800337

Place: Alur
Date: 12-07-2025

సీమ రైతుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

- పంపు హౌస్ ప్రారంభంలో టిడిపి నేత రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాయలసీమ రైతులకు సాగునీరందించి అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని టిడిపి నాయకులు, మాధవరం మాజీ సర్పంచి ఎన్.రఘునాథ్ తెలిపారు. బుధవారం మండలంలోని బూదూరు పంపు హౌస్‌ను ప్రారంభించి మాట్లాడారు. నదుల అనుసంధానంతో సీమ సస్యశ్యామలంగా మారే సమయం దగ్గరలోనే ఉందని తెలిపారు. 150 హెచ్‌పి సామర్థ్యం గల రెండు మోటార్లను స్విచ్ఛాన్ చేసినట్లు చెప్పారు. దీని కింద బూదూరు, తిమ్మాపురం గ్రామాలకు సంబంధించిన 910 ఎకరాలకు సాగునీరు విడుదల చేసినట్లు తెలిపారు. రైతుల అభివృద్ధికి తమ సోదరులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. లక్ష్మీకాంత్, అబ్రహాం, మోషేజు, దాసు, భూషణం, శాంతిరాజు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న రఘునాథ్ రెడ్డి

ఎరువుల దుకాణాలపై తనిఖీలు

- 33 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ, సిట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బుధవారం మంత్రాలయం, మాధవరం గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మాధవరం గ్రామంలోని శ్రీపాండురంగ ట్రేడర్స్‌లో రూ.8.92 లక్షల విలువ గల ఎరువులను సీజ్ చేసి అమ్మకాలు జరపరాదని దుకాణ యజమానిని ఆదేశించారు. సిట్ అధికారుల ఆదేశాల మేరకు 6 ఎరువుల నమూనాలను, 3 పురుగు మందుల నమూనాలను సేకరించి పరీక్షలకు పరిశోధన కేంద్రానికి పంపుతున్నామని తెలిపారు. ఒంగోలు ఎడిఎ రమేష్ బాబు, కడప సిఐ, విఅండ్ఇ నారాయణప్ప, ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, మంత్రాలయంలో ఎఒ జీరా గణేష్ పాల్గొన్నారు. **హోళగుందలో** వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సుదర్శన్ రాజు, వెంకట ప్రసాద్, చెంగళరాయుడు, ఆనంద్ హాజరయ్యారు.

మంత్రాలయంలో తనిఖీలు

హోళగుందలో...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

పంచాయతీ రాజ్ శాఖ- బిట్ టెండర్ ప్రకటన

నెంబర్ : 01/ఏ.ఈ/2025-26 **తేది :17-07-2025**

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, క్వాలిటీ అస్యూరెన్స్ మరియు క్వాలిటీ కంట్రోల్ (పి.ఆర్) సబ్ డివిజన్-02, కర్నూలు పరిధిలో జరిగిన పనులను పర్యవేక్షించుటకు గాను అర్హత కలిగిన వాహనము ఏ.సి (మహీంద్రా కాంపేర్,టావెరా, బోలెరో, సుమో గోల్డ్, టొయోట) యజమాని నుండి టెండరు ఆహ్వానించటమైనది. GO.Ms.No.87, తేది: 01-06-2017 Finance (HR-VI-TFRVA) Department of A.P లో పేర్కొన్న నిబంధనల ప్రకారం టెండరు జరుపబడును. ఆసక్తి కల్గిన వారి నుండి సీల్డ్ వేసిన టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

టెండరు షెడ్యూల్ కొరకు ధరఖాస్తులు స్వీకరించు తేది	: 19-07-2025 సా// 5-00 గంటల వరకు
టెండరు షెడ్యూల్ జారీ చేయు తేదీ	: 23-07-2025 సా// 5-00 గంటల వరకు
టెండరు షెడ్యూల్ స్వీకరించు తేది	: 26-07-2025 సా// 3-00 గంటల వరకు
టెండర్లు తెరచు తేది	: 26-07-2025 సా// 5-00 గంటలకు

ఇతర వివరములకు కార్యాలయపు పని వేళలందు తెలుసుకొనగలరు.

ఉప కార్య నిర్వాహక ఇంజినీర్
క్వాలిటీ అస్యూరెన్స్ మరియు క్వాలిటీ కంట్రోల్(పి.ఆర్)
సబ్-డివిజన్-02, కర్నూలు